సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.16 వేల ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.36

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.36, కనిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.3°/22.1°

జిల్లా పరిధిలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం.. ఇద్దరికి జైలు



సోమందేపల్లి: విధుల్లో నిర్లక్ష్యం వహించి ఓ వ్యక్తి మృతికి కారణమైన ట్రాన్స్‌కో లైన్‌మెన్‌తో పాటు మరో వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ పెనుకొండ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బుధవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నాగినాయని చెరువు గ్రామానికి చెందిన నీరుగంటి బాబయ్య అనే వ్యక్తి 2016లో గ్రామంలోనే విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటనకు ట్రాన్స్‌కో లైన్‌మెన్ శివశంకర్‌రెడ్డి, డిష్ ఆపరేటర్ మహేష్ కారణమని అప్పటి ఎస్‌ఐ గౌస్‌బాషా కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు బుధవారం పెనుకొండ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు రాగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి బొజప్ప ఆ ఇద్దరిని ముద్దాయిలుగా నిర్ధారించారు. ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసు వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామల, ముద్దాయిలకు శిక్ష పడేలా కోర్టుకు సాక్ష్యాధారాలు సమర్పించిన కానిస్టేబుల్ బాబ్జాన్‌ను ఎస్పీ రత్న ప్రత్యేకంగా అభినందించినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

అర్జీల పరిష్కారంలో జవాబుదారీగా ఉండాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపడంతో అధికారులంతా జవాబుదారీ తనం ప్రదర్శించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. బుధవారం ఆయన తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బియాండ్ ఎస్‌ఎల్‌ఏలో వచ్చిన వినతులను సంబంధిత శాఖ అధికారి రోజూ పరిశీలిస్తూ ఉండాలన్నారు. సమస్య ఏదైనా 24 గంటల్లోపు పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఏదైనా అర్జీకి పరిష్కారం చూపలేకపోతే అందుకు గల కారణాలను తప్పని సరిగా పొందుపరచాలన్నారు. అలాగే జిల్లాలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 2 వరకు చేపట్టే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను తహసీల్దార్లు, ఆర్డీఓలు పరిశీలించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా విజయలక్ష్మి

అనంతపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాస్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ చీఫ్ సెక్రటరీ సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అనంతపురం డీఐజీగా పని చేస్తున్న ఎం. మాధవిని ఏలూరు జిల్లా డీఐజీగా బదిలీ చేశారు.

అనంతపురం డీఆర్‌గా భార్గవ్ కొనసాగింపు..

అనంతపురం జిల్లా రిజిస్ట్రార్‌గా జీ. భార్గవ్‌ను అలాగే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది క్రితం ట్రైనీ డీఆర్‌గా జిల్లాకు వచ్చిన భార్గవ్‌కు 8 నెలల క్రితం ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ క్రమంలోనే అదేస్థానంలో కొనసాగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

శ్రీ సత్యసాయి జిల్లా డీఆర్ బదిలీ..

శ్రీ సత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ క్రిష్ణకుమారిని శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. అయితే శ్రీ సత్యసాయి జిల్లాకు కొత్త డీఆర్‌ను నియమించలేదు. అనంతపురం ఆడిట్ విభాగం డీఆర్‌గా బి.శ్రీనివాసులను నియమించారు.

పెనుకొండ డీఎస్పీగా వై.వెంకటేశ్వర్లు

పుట్టపర్తి టౌన్: పెనుకొండ నూతన డీఎస్పీగా వై. వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది సీఐలకు పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లు ఇస్తూ బుధవారం డీజీపీ తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలోనే సీఐగా ఉన్న వై.వెంకటేశ్వర్లుకు డీఎస్పీగా పదోన్నతి కల్పించి పెనుకొండకు పోస్టింగ్ ఇచ్చారు. త్వరలోనే ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. గతంలో పెనుకొండ డీఎస్పీగా ఉన్న అర్ల శ్రీనివాసులుకు పదోన్నతి రాగా, ఆయన జిల్లా అడిషనల్ ఎస్పీగా నియమితులైన విషయం తెలిసిందే.



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రస్తుత బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఈనాడుకు ఇచ్చిన ఇంటర్వ్యూ


హిందూపురం

అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ.. వాడా ప్రచారం చేశారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం, తల్లికి వందనం పథకంలో భాగంగా ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ. 15 వేల నగదు, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఖాతాల్లో జమ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర వాటిని తమ మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. అధికారం చేపట్టి రేపటితో వందరోజులవుతున్నా... ఏ ఒక్క పథకం అమలుపై స్పష్టమైన హామీ లేదు. దీంతో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పథకాలన్నీ పక్కాగా అమలు చేసిందని, జగన్ లాగే చంద్రబాబు కూడా కచ్చితంగా హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

- ఎన్నికల వేళ సూపర్‌సిక్స్ పథకాలంటూ చంద్రబాబు ఢంకా
- అధికార పగ్గాలు చేపట్టాక హామీలు గాలికి
- బడులు తెరిచి మూడు నెలలైనా 'తల్లికి వందనం' ఊసే లేదు
- ఖరీఫ్ ముగుస్తున్నా ఒక్క రైతుకూ దక్కని రూ.20 వేల సాయం
- ఎండమావిగా మారిన నిరుద్యోగుల రూ.3 వేల భృతి
- ప్రతి మహిళకూ రూ.1,500 పథకానికి పంగనామాలు
- ఉచిత బస్సు ప్రయాణంపైనా నోరెత్తని వైనం
- ఓట్లేసి చంద్రబాబు వంచనకు గురయ్యామని అన్ని వర్గాల్లో ఆందోళన

జగన్ పాలనలో అమ్మఒడి జిల్లాలో అమలు ఇలా..



సంవత్సరం	తల్లుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	1,62,574	243.86
2020-21	1,61,554	242.33
2021-22	1,66,398	249.60
2022-23	1,62,080	210.10

జగన్ పాలనలో రైతు భరోసా అమలు ఇలా..



సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	2,56,170	345.83
2020-21	2,78,337	375.75
2021-22	2,70,443	359.80
2022-23	2,68,947	364.24
2023-24	2,79,556	321.47

సాక్షి, పుట్టపర్తి : ఇటీవల ఎన్నికల వేళ సూపర్‌సిక్స్ హామీలంటూ ఊరూరా ప్రచారం నిర్వహించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే వాటి ఊసే ఎత్తడం లేదు. 2014లోనూ 'పూర్తి రుణమాఫీ చేస్తా, బ్యాంకుల్లో ఉంచిన బంగారుకు పైసా కట్టొద్దు, లోన్లు చెల్లించవద్దు' అంటూ ఆశ పెట్టి గద్దెనెక్కాక వంచించిన ఆయన.. నేడు కూడా అదే దారిలో నడుస్తుండడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

తల్లుల వేదన అంతా ఇంతా కాదు..

గతంలో స్కూళ్లు తెరిచిన వారం రోజుల్లోనే 'అమ్మ ఒడి' పథకం కింద రూ.15 వేలను అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో జమ చేసింది. కానీ ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని ఇటీవలి ఎన్నికల్లో చంద్రబాబు చెప్పారు. ఈ క్రమంలో సాయం కోసం తల్లిదండ్రులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

రైతులకు శఠగోపం..

ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఇస్తానని బాబు నమ్మబలికారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సాయం ఊసే లేదు. దాని గురించి చర్చ కూడా లేదు. గత ప్రభుత్వం ఏటా రూ.13,500ను పెట్టుబడి సాయం కింద మూడు దఫాల్లో అందించేది. బాబు తన ప్రచారంలో రూ.20 వేలు అనే సరికి ఆశపడి ఓటు వేస్తే ఇప్పుడు నిలువునా ముంచారని, పైరు సాగు చేద్దామంటే పైసా సాయం ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 3.65 లక్షల మంది రైతులు అన్నదాతా సుఖీభవ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.


నిరుద్యోగుల భృతి గాలికి..

చదువుకుని ఉద్యోగం రాని జిల్లా యువకులు చంద్రబాబు మాటలు నమ్మి నిలువునా మోసపోయామంటున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇస్తానన్న ఆయన గద్దెనెక్కి మూడు నెలలు దాటినా పైసా ఇవ్వలేదు. జిల్లాలో 3.43 లక్షలమంది నిరుద్యోగ భృతికోసం ఎదురు చూస్తున్నారు.


మహిళలకు మళ్లీ కుచ్చుటోపీ..

2019 ఎన్నికల్లో పసుపు కుంకుమ అంటూ మభ్య పెట్టిన చంద్రబాబు.. 2024 ఎన్నికల్లో ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఎంతోమంది మహిళలు ఆశతో కూటమికి ఓటేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక పైసా ఇవ్వలేదు. మళ్లీ నమ్మి నట్టేట మునిగామా అన్న ఆలోచనలో పడ్డారు. దాదాపు 7 లక్షల మంది మహిళలు చంద్రబాబును తిట్టిపోస్తున్నారు.

- వీటితో పాటు ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంపైనా ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయి. ఉచిత బస్సు ప్రయాణానికి జిల్లాలో 6,99,382 మంది అర్హులున్నారు. అలాగే మూడు సిలిండర్ల పథకానికి ఉమ్మడి జిల్లాలో 8,08,489 మంది అర్హులున్నారు.




'అన్నదాత సుఖీభవ'కు జిల్లాలో అర్హుల సంఖ్య
3,65,875
ఈ ఏడాది అందాల్సిన మొత్తం:
రూ.**731.75** కోట్లు
ప్రస్తుత పరిస్థితి: ఈ పథకం కింద రైతుకు ఏటా రూ.20 వేలు ఇవ్వాల్సి ఉంది. కీలకమైన ఖరీఫ్ సమయం దాటిపోతున్నా.. ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు.



జిల్లాలో 18-60 ఏళ్ల మధ్య వయస్సు వారు
6,99,382
గడిచిన మూడు నెలలకు ఇవ్వాల్సింది
రూ.**314.72** కోట్లు
ప్రస్తుత పరిస్థితి: జిల్లాలో 18-60 ఏళ్ల మధ్య వయస్సు వారు దాదాపు 7 లక్షల మంది ఉన్నారు. వీరంతా కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే నెలకు రూ.1,500 వస్తుందని ఆశపడ్డారు. కానీ దీనిపై ఏ నిర్ణయమూ తీసుకోలేదు.



'తల్లికి వందనం' అర్హులు
1 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థుల సంఖ్య:
2,23,000
ఈ ఏడాది ఇవ్వాల్సిన మొత్తం:
రూ.**334.50** కోట్లు
ప్రస్తుత పరిస్థితి: తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. బడులు తెరిచి మూడు నెలలు దాటినా ఎటువంటి సాయమూ అందలేదు.



నిరుద్యోగ భృతి
జిల్లాలోని నిరుద్యోగుల సంఖ్య
3,43,000
గడిచిన మూడు నెలల్లో అందాల్సిన భృతి
రూ.**308.70** కోట్లు
ప్రస్తుత పరిస్థితి: ఉద్యోగం దక్కని యువతకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం వచ్చి ఇప్పటికి మూడు నెలలు దాటినా ఇంతవరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు.

మాట తప్పకూడదు



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని చెప్పింది. అధికారంలోకి వచ్చి వందరోజులవుతున్నా దాని ఊసే ఎత్తడం లేదు. ఇచ్చిన మాట ప్రకారం నెలకు రూ.1,500 ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– స్వర్ణలత, ఓడీ చెరువు

చదువులు ముందుకు సాగేదెలా..?



పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేట్ పాఠశాలలో ఒకరు 6వ తరగతి, మరొకరు 8వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం కింద ఇద్దరి పిల్లలకు రూ.30 వేలు ఇస్తామన్నారు. పుస్తకాలు, ఫీజులు తదితర అవసరాలకు పనికి వస్తుందని అనుకున్నాం. అయితే బడి తెరిచి మూడు నెలలు దాటినా ఇంతవరకూ డబ్బు జమ కాలేదు. గతంలో వైఎస్ జగన్ బడులు తెరిచే నాటికే అమ్మఒడి నగదు ఖాతాల్లో జమ చేసేవారు.

– అనిత, పుట్టపర్తి

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి, నాలుగు, ఏడో తరగతి చదువుతున్నారు. ఈ ముగ్గురికీ కలిపి రూ. 45 వేలు వెంటనే జమ చేయాలి. గత జగన్ సర్కార్ అమ్మఒడి పక్కాగా అమలు చేసింది.

– కొమ్మిద్ది సాలెమ్మ, దళితవాడ, తనకల్లు

పెట్టుబడికి అప్పు చేయాలి



ఖరీఫ్ సీజన్ దాటి పోతున్నా... ఈ ఏడాది అన్నదాతా సుఖీభవ కింద అందాల్సిన రూ.20 వేల సాయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఏటా ఖరీఫ్ ప్రారంభంలోనే రైతు ఖాతాలకు రైతు భరోసా డబ్బు జమయ్యేది. పంటల సాగుకు ఇతరుల వద్దకు అప్పుకు వెళ్లాల్సిన పని ఉండేది కాదు. చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరి వందరోజులవుతున్నా రైతుకు సాయం గురించి ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో పెట్టుబడుల కోసం ఇతరుల వద్ద అప్పులు చేయాల్సి వచ్చింది.

– జయచంద్రారెడ్డి, రైతు, వేపరాల, గాండ్లపెంట

జాబ్ వచ్చే వరకు భృతి ఇవ్వండి



నేను బీటెక్ చదివాను. ప్రభుత్వ ఉద్యోగం రాక ఆన్‌లైన్ సంస్థలో డెలీవరీ బాయ్‌గా అరకొరగా సంపాదిస్తూ బతుకుతున్నా. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుదామన్నా అందుకు తగ్గ ఆర్థిక వనరులు లేవు. చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తే ఉపయోగపడుతుంది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారందరికీ ఉద్యోగం వచ్చే వరకూ నిరుద్యోగ భృతి ఇవ్వాలి. లేకుంటే మాలాంటి నిరుద్యోగులు రోడ్డెక్కి ఆందోళనలు చేపడతాం.

– మధు, కొత్తచెరువు మండలం

ఇసుక సరఫరాలో అక్రమాలు సహించం

- నూతన మార్గదర్శకాల మేరకు నేటి నుంచి ఇసుక సరఫరా
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ఇసుక సరఫరాలో అక్రమాలు సహించబోనని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సరఫరా జరగాలని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. బుధవారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇసుక ఆన్‌లైన్ దరఖాస్తు విధానంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భం కలెక్టర్ మాట్లాడుతూ, నూతన మార్గదర్శకాల మేరకు జిల్లాలో గురువారం నుంచి ఇసుక కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇసుక రవాణా చేసే లారీ యజమానులు తమ వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇసుక సరఫరాలో ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో గానీ, వ్యక్తిగతంగా గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇసుక రవాణాకు గనుల శాఖ వద్ద రిజిస్టర్ చేసుకున్న వాహనాలనే అనుమతించాలని సూచించారు. రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు లోడింగ్ ఉంటుందని, రోజుకు 60 వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లోని పెద్ద చిగుళ్ల రేవు, చిన్న చిగుళ్ల రేవు రీచ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ యార్డ్ నుంచి గురువారం నుంచి వినియోగదారులకు ఇసుక సరఫరా చేస్తామన్నారు. సమీక్షలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, గనులశాఖ అధికారి రామ్మోహన్, పీబీసీ డ్యాం ఈఈ రాజశేఖర్, జలవనరుల శాఖ అధికారి మల్లికార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఇక్బాల్, పర్యావరణ అధికారి కిశోర్ రెడ్డి, ఆర్డీఓలు భాగ్యరేఖ, వెంకటశివ సాయిరెడ్డి, రవాణాశాఖ అధికారులు కరుణసాగర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

క్లుప్తంగా

అధిక వడ్డీ వసూలు చేస్తున్న ఇద్దరి అరెస్ట్

తనకల్లు: అప్పులు ఇచ్చిన తర్వాత అధిక వడ్డీ వసూలు చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం కదిరి రూరల్ సీఐ నాగేంద్ర వెల్లడించారు. తనకల్లు మండలం రాచువారిపల్లికి చెందిన శివతో పాటు కొండరాళ్ల గుట్టకు చెందిన ఐదుగురు అదే గ్రామ నివాసి మస్తాన్‌రెడ్డి వద్ద అప్పు చేశారు. అప్పు ఇచ్చే సమయంలో వారి వద్ద నుంచి ఖాళీ ప్రాంసరీ నోట్లపై సంతకాలు పెట్టించి తీసుకున్నాడు. అనంతరం నెలకు రూ.10 నుంచి రూ.20 వరకూ వడ్డీ వసూలు చేస్తూ వచ్చాడు. విషయాన్ని ఆలస్యంగా పసిగట్టిన బాధితులు తమ ప్రాంసరీ నోట్లను ఇస్తే అప్పు మొత్తం చెల్లిస్తామన్నారు. ఇందుకు అంగీకరించని మస్తాన్‌రెడ్డి, ఆయన కుమారుడు కిషోర్ రెడ్డి బెదిరింపులకు దిగారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అనంతరం మస్తాన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ధరణిబాబు తెలిపారు. వీరి ఐదు ఖాళీ ప్రాంసరీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు.

వంటనూనె విక్రయదారులపై కేసుల నమోదు

హిందూపురం అర్బన్: అధిక ధరలకు వంట నూనె విక్రయిస్తున్న ఐదుగురు వ్యాపారులపై హిందూపురం తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ కేసులు నమోదు చేశారు. బుధవారం మారు వేషంలో ఆయన వంట నూనె కొనుగోలుకు వెళ్లిన సమయంలో రూ.108 ఎమ్మార్పీ ఉన్న వంట నూనెను రూ.120తో విక్రయిస్తున్నట్లుగా, మరికొందరు ఏకంగా రూ.135తో అమ్ముతున్నట్లుగా గుర్తించి కేసులు నమోదు చేశారు.

కొండాపురంలో మట్టి దోపిడీ

- బరి తెగించిన కూటమి నాయకులు
- పట్టించుకోని అధికారులు



జేసీబీతో మట్టిని తవ్వుతున్న దృశ్యం

పెనుకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని కొండాపురం చెరువు నుంచి భారీ ఎత్తున మట్టి దోపిడీ జరుగుతోంది. ఇందు కోసం 10 ట్రాక్టర్ల ద్వారా రేయింబవళ్లు మట్టిని తరలించేలా కూటమి నాయకులు ఏర్పాట్లు చేశారు. పెనుకొండ పట్టణంతో పాటు మరో విలువైన స్థలానికి మట్టిని తోలి నేలను చదును చేయడానికి రియల్టర్లతో ఇప్పటికే కూటమి నేతలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ట్రాక్టర్లను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో మంత్రి సవిత పేరు చెప్పి టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగారు. దీంతో గ్రామస్తులు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఈ విషయంగా తామేమీ చేయలేమంటూ అధికారులూ చేతులెత్తేసినట్లు తెలిసింది. దీంతో గ్రామస్తుల్లో అసహనం వ్యక్తమవుతోంది. అధికారుల తీరు మార్చుకుని మట్టి తరలింపులు ఆపకపోతే ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరికలు జారీ చేశారు.

ధర్మవరంలో నెగ్గేదెవరు? తగ్గేదెవరు?!

- పరిటాల శ్రీరామ్ వర్సెస్ ధర్మవరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున
- విధులకు హాజరైతే బయటకు గెంటేస్తామంటూ శ్రీరామ్ హెచ్చరిక
- ప్రభుత్వం నియమించింది కాబట్టి పని చేసి తీరుతానన్న కమిషనర్





కమిషనర్ మల్లికార్జునను అడ్డుకునేందుకు మున్సిపల్ కార్యాలయం వద్ద వచ్చిన టీడీపీ శ్రేణులు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు తమ స్వేచ్ఛను కోల్పోయారు. నిజాయితీతో పని చేస్తూ నిక్కచ్చిగా వ్యవహరించే అధికారులు తమకు అవసరం లేదంటూ స్థానిక టీడీపీ నాయకులు తమ అధినేత బాటలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారు. ఇందుకు ధర్మవరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వ్యవహారం నిలువుటద్దమైంది. విధులకు హాజరైతే చొక్కా పట్టుకుని బయటకు గెంటేస్తానంటూ కార్యకర్తల సమావేశంలో పరిటాల శ్రీరామ్ వార్నింగ్ ఇచ్చి అహంకారాన్ని ప్రదర్శించగా... ప్రభుత్వం తనని నియమించింది కాబట్టి విధులను నిజాయితీతో నిర్వర్తించి తీరుతానంటూ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ప్రతిగా స్పందించారు. ఎవరికి వారే పంతం పట్టడంతో వీరిద్దరిలో నెగ్గేదెవరు? తగ్గేదెవ్వరూ? అన్నది ప్రస్తుతం ధర్మవరంలో హాట్ టాపిక్‌గా మారింది.

పరిటాలకు మింగుడు పడని అంశం..

ధర్మవరం మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా మల్లికార్జునను 15రోజుల క్రితం ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అయితే సదరు కమిషనర్ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనూ ధర్మవరం మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేశారు. కరోనా వంటి విపత్కర సమయంలో ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొందారు. సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ పరిధిలో గతంలో పని చేసిన అనుభవం ఉండడంతో ఆయన పర్యవేక్షణలో ధర్మవరం మరింత అభివృద్ధి చెందుతుందని భావించిన కూటమి ప్రభుత్వం ఇటీవల ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయం ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న పరిటాల శ్రీరామ్‌కు మింగుడు పడలేదు. కమిషనర్‌గా మల్లికార్జున బాధ్యతలు స్వీకరించక ముందే పరిటాల శ్రీరామ్ టీడీపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి అనుచిత వ్యాఖ్యలు చేశారు. మల్లికార్జున కమిషనర్‌గా బాధ్యతలు చేపడితే చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లి బయటకు గెంటేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అంతటితో ఆగకుండా మల్లికార్జున కార్యాలయానికి రాకుండా ఉండేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలను పంపి అల్లర్లకు శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కార్యాలయంలో టీడీపీ నాయకులు తిష్ట వేసి నిరసన తెలుపుతుండటంతో పోలీసులు ఇరుకున పడ్డారు. తమను మున్సిపల్ కార్యాలయం వద్ద భద్రతకు కేటాయిస్తే రోజువారీ డ్యూటీలు ఎలా చేయాలంటూ వారిలో వారు మదన పడుతున్నారు.

అమ్మో ధర్మవరమా?

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వ్యవహారం చిలికి చిలికి గాలి వానగా మారడంతో ధర్మవరానికి బదిలీపై వెళ్లాలంటే అధికారులు హడలెత్తుతున్నారు. నిబంధనలకు తిలోదకాలిచ్చి అధికార పార్టీకి తొత్తుగా పనిచేయడం తమ వల్ల కాదని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే ధర్మవరానికి పోస్టింగ్ అయిన అధికారులు సైతం తమను మరో ప్రాంతానికి బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఓ ముఖ్య అధికారి సైతం ఇక్కడ పని చేయలేక వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. మొత్తానికి టీడీపీ నేతల వైఖరితో ధర్మవరం వాసులు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణ అభివృద్ధిలో కీలకమైన అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్న నేతల తీరుపై మండిపడుతున్నారు.

బాలిక అదృశ్యం

లేపాక్షి: మూడు రోజులుగా కనిపించకుండా పోయిన తమ కుమార్తె ఆచూకీ తెలపాలని లేపాక్షి మండలం కంచిసముద్రం గ్రామానికి చెందిన గంగరత్నమ్మ, రవి దంపతులు కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 8వ తరగతి చదువుతున్న తమ కుమార్తె రేఖ ఆదివారం ఉదయం నుంచి కనిపించడం లేదన్నారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గ్రామానికి చెందిన నలుగురు ఆకతాయిలు తమ కుమార్తెను కిడ్నాప్ చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

శరీరానికి నిప్పంటించుకుని... చెరువులో దూకి



రంగనాథ్ మృతదేహం

అగళి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అగళి మండలం ఇరిగేపల్లికి చెందిన కామరాజు, మహదేవమ్మ దంపతుల రెండో కుమారుడు రంగనాథ్ (21) రెండేళ్లుగా మానసిక సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లి చికిత్స చేయించి, పిలుచుకొచ్చేవారు. ఈక్రమంలోనే గ్రామంలో రాత్రి వేళ పిచ్చి పట్టినట్లు తిరిగే రంగనాథ్ రెండు రోజుల క్రితం విష పూరిత ద్రావకం తాగాడు. విషయం గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి కాపాడుకున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో కుమారుడు నిద్రిస్తుండగా మధ్య రాత్రి తండ్రి పంటకు నీళ్లు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. ఆ సమయంలో మేల్కొన్న రంగనాథ్ తమ పొలం వద్దకెళుతూ మార్గం మధ్యలో చెరువు వద్ద శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అనంతరం మంటల వేడిని తట్టుకోలేక చెరువులో దూకాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు చెరువు నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని రంగనాథ్ మృతదేహం పడి బోరున విలపించారు. ఘటనపై ఎస్‌ఐ వీరేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

10 ద్విచక్ర వాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

హిందూపురం అర్బన్: ద్విచక్ర వాహనాలు అపహరించుకెళుతున్న యువకుడిని అరెస్ట్ చేసి, 10 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను బుధవారం హిందూపురం సీఐ అబ్దుల్ కరీం వెల్లడించారు. హిందూపురం పరిసర ప్రాంతాలతో పాటు కర్ణాటకలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న పుట్టపర్తి మండలం పెద్ద కమ్మవారిపల్లికి చెందిన రమేష్ చౌదరి అలియాస్ రమేష్ ఉరఫ్ మారుతిని పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యసనాలకు బానిసైన రమేష్ జులాయిగా తిరిగే వాడు. ఈ క్రమంలో తన అవసరాలకు డబ్బు ఇచ్చేవారు లేక పోవడంతో ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవాడు. ఏడాదిగా ఇదే తంతు కొనసాగిస్తూ వచ్చాడు. హిందూపురంలోని ఎంజీఎం మైదానం ఎదుట 2023 ఆగస్టులో నిలిపిన బైక్‌ను, 20 రోజుల క్రితం పాత రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న ఆటో స్టాండ్ వద్ద నిలిపిన మరో ద్విచక్ర వాహనం అపహరణకు సంబంధించి కేసులు నమోదు చేసిన పోలీసులు సీఐలు రాజగోపాలనాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, జనార్దన్ ఆధ్వర్యంలో బృందాలుగా విడిపోయి విస్తృత తనిఖీలు చేపట్టారు. దీంతో బుధవారం ఉదయం రహమత్‌పుర సర్కిల్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న రమేష్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో ద్విచక్ర వాహనాల అపహరణలు వెలుగు చూశాయి. నిందితుడి నుంచి పది ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే క్రిమినల్ కేసు

- విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎస్‌ఈ శ్రీనివాసబాబు



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

అనంతపురం టౌన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆ శాఖ విజిలెన్స్ విభాగం ఎస్‌ఈ శ్రీనివాసబాబు హెచ్చరించారు. ఎలాంటి మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 18మందిని బుధవారం గుర్తించి కేసులు నమోదు చేసి, రూ.2.49 లక్షల జరిమానా విధించారు. అనంతపురంలోని డీ5 పరిధిలో 5 కేసులు, అమరాపురం మండలంలో 5, ఓబుల దేవర చెరువులో 8 కేసులు నమోదయ్యాయి. తనిఖీల్లో పట్టుబడిన వారిపై మాల్ ప్రాక్టీస్, డైరెక్ట్ టాపింగ్, పిల్లరేజ్ కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు ఈఈ గోపి, డీఈలు రామాంజినేయులు, నాగేంద్ర, ఏఈ పీరా పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేయొద్దు

- ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్



మాట్లాడుతున్న మహేష్

పరిగి: సామాన్య, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా కూటమి ప్రభుత్వం జారీ చేసిన 107, 108 జీఓలను తక్షణమే రద్దు చేయాలని ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతులు సాధించిందన్నారు. దశల వారీగా భవన నిర్మాణాలు పూర్తి చేసి ఆయా కళాశాలలను ప్రారంభించేలా కార్యాచరణను రూపొందించినట్లు గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ఇప్పటికే ప్రారంభమైన 5 మెడికల్ కళాశాలల్లో 750 ఎంబీబీఎస్ సీట్లు గతేడాది భర్తీ అయ్యాయన్నారు. అయితే పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించకూడదనే ధోరణితో కూటమి సర్కార్ మెడికల్ సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ కిందకు చేర్చి ఎన్నారైలకు లబ్ధి చేకూరేలా పథకం ప్రకారం కుట్ర సాగిస్తోందని మండిపడ్డారు. ఐదు మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతులు లేవంటూ సాకుగా చూపి ఆయా కళాశాలలను నిర్వహించలేమంటూ ఎన్‌ఎంసీకి లేఖ రాయడాన్ని తప్పుబట్టారు. కొన్నేళ్లుగా నీట్ కోచింగ్ తీసుకుని మెడికల్ సీట్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు కూటమి సర్కార్ వైఖరితో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఎన్‌ఎంసీకి రాసిన లేఖను వెనక్కు తీసుకోవడంతో పాటు 17 మెడికల్ కళాశాలల ప్రారంభానికి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు హరీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టపర్తిలో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు



డ్రెయినేజీని శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు



కొబ్బరి బోండాల వ్యర్థాలపై అబేట్ మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పుట్టపర్తి అర్బన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో అధికారులు విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో పేరుకుపోయిన అపరిశుభ్రతపై 'ప్రాణాలు పోతున్నా... పట్టించుకోరా' శీర్షికన బుధవారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, ఏఈ స్వాతి, కౌన్సిలర్ భాస్కరరెడ్డి తదితరులు స్పందించారు. బుధవారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ సుడిగాలి పర్యటన చేశారు. చెత్తా చెదారం, భవన శిథిలాలు, కొబ్బరి బోండాల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రజలను హెచ్చరించారు. పారిశుద్ధ్య పనులు విస్తృతంగా చేపట్టారు. డ్రెయినేజీలను శుభ్రం చేసి మురుగునీరు నిల్వ లేకుండా పారేలా చర్యలు తీసుకున్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కొబ్బరిబోండాల వ్యర్థాలపై అబేట్ మందును పిచికారీ చేయించారు. కుళాయి నీటిని వృథాగా రోడ్లపైకి వదిలినా, దుస్తులు శుభ్రంచేసిన నీటిని వీధుల్లో పడేసినా వారి కుళాయి కనెక్షన్లను రద్దు చేస్తామని కమిషనర్ ప్రహ్లాద హెచ్చరించారు.

లోకో పైలెట్ దుర్మరణం



మహమ్మద్ రఫీ (ఫైల్)

గుంతకల్లు రూరల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో లోకో పైలెట్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి రైల్వేలో లోకో పైలెట్‌గా విధులు నిర్వర్తించే షేక్ మహమ్మద్ రఫీ (38)కి భార్య అఫ్రీన్, 8, 6 సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. గుంతకల్లులోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న ఆయన మంగళవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై పట్టణ శివారులోని చెన్నప్ప కొట్టాల మీదుగా వెళుతుండగా ఓ మలుపు వద్ద నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం వేకువజాము 1.30 గంటల సమయంలో అటుగా వెళుతున్న వాహనదారులు గుర్తించేలోపు ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



నరసింహులు (ఫైల్)

ఉరవకొండ: విద్యుత్ షాక్‌కు గురై ఓ కౌలు రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి చెందిన నరసింహులు (45)కు భార్య నరసమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునే నరసింహులు 5 ఎకరాల పెన్నహోబిలం ఆలయ మాన్యం భూమిని కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేస్తున్నాడు. బుధవారం పొలంలో బోరుబావికి ఏర్పాటు చేసిన మోటారుకు విద్యుత్ సరఫరా కాని విషయాన్ని గుర్తించిన ఆయన మరమ్మతుకు పూనుకున్నాడు. ఆ సమయంలో ఉన్నఫళంగా కరెంట్ ప్రసరించడంతో షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన చుట్టు పక్కల పొలాల్లో పనిచేస్తున్న కూలీలు వెంటనే నరసింహులును ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.





కలెక్టర్, జేసీని కలసిన ఏఎస్పీ ఆర్ల

ప్రశాంతి నిలయం: జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బాధ్యతలు స్వీకరించిన ఆర్ల శ్రీనివాసులు బుధవారం కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కలను అందజేసి, మాట్లాడారు.

రూ.14 లక్షల విలువైన నగల అపహరణ

హిందూపురం అర్బన్: స్థానిక టీచర్స్ కాలనీలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... టీచర్స్ కాలనీలో నివాసముంటున్న తాజుద్దీన్... తూమకుంట పారిశ్రామిక వాడలోని ఓ కర్మాగారంలో పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఆయన విధులకు వెళ్లిన సమయంలో భార్య షాతాజ్ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంట్లోకి చొరబడి 23 తులాల బంగారు నగలు, రూ.2,95,000 నగదు, కొన్ని వెండి వస్తువులు అపహరించుకెళ్లారు. రాత్రికి ఇంటికి చేరుకున్న తాజుద్దీన్ చోరీ విషయాన్ని గుర్తించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ అబ్దుల్ కరీం తెలిపారు.